GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్టార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 119 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 +https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం 04 డిసెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# స్టెల్లా ఎల్ పనామా నౌకలో మరోసారి తనిఖీలు





కాకినాడ, డిసెంబర్ 04, (రిపబ్లిక్ న్యూస్): రేషన్ బియ్యం నిల్వచేసిన స్టెల్లా ఎల్ పనామా నౌకలో మరోసారి తనిఖీలు చేపట్టారు.ఇందు కోసం పోర్టు, కస్టమ్స్, పౌరసరఫరాలు, పోలీసు, రెవెన్యూ అధికారులతో బృందం సముద్రంలోకి వెళ్లారు. ఈ మల్టీ డిసిప్లీనరీ కమిటీ బృందం రేషన్ బియ్యం నమూనాలు సేకరించి నిజానిజాలు నిగ్గు తేల్చనుంది.నౌకలో 640 టన్నుల పేదల బియ్యం ఉన్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ గత నెల 27న ప్రకటించారు. 29న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్ కాకినాడ పోర్టులు సందర్శించి.. ఇక్కడి భద్రత వైఫల్యాలు, కీలక శాఖల పర్యవేక్షణ లోపాలపై సంచలన వ్యాఖ్యలు చేశా- రు. అక్కడికక్కడే 'సీజ్ ద షిప్' అని ఆదేశించారు. దీంతో అందరి దృష్టి కాకినాడ పోర్టుల వైపు మళ్లింది. కాకినాడ కేంద్రంగా గత అయిదేళ్లు రెచ్చిపోయిన రేషన్ మాఫియా రెక్కలు విరిచేయాలన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. వివాదాస్పద నౌక నుంచే ప్రక్షాళనకు నిర్ణయించింది. ఈనేపథ్యంలో ఏర్పాటు చేసిన బృందం బుధవారం నౌకను పరిశీలించింది.

# నంబర్ 2 పర్మినెంట్..
## నంబర్ ఎ పొజిషన్ మాత్రమే మారుతుండేది: సీఎం రేవంత్


దివంగత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య నిబద్ధత, సమర్థత వల్లే తెలంగాణ మిగులు బడ్జెట్ గా ఆవిష్కృతమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్,డిసెంబర్ 04, (రిపబ్లిక్ న్యూస్): దివంగత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య నిబద్ధత, సమర్థత వల్లే తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఆవిష్కృతమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్తో రాష్ట్రం ఏర్పాటైందని గుర్తుచేశారు. రోశయ్య మూడో వర్ధంతి సందర్భంగా నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడారు."నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రోశయ్య నన్ను తన ఛాంబర్కు పిలిపించుకుని విలువైన సూచనలు చేశారు. బాగా మాట్లాడుతున్నావు.. మరింత అధ్యయనం చేసి సభకు రావాలని చెప్పారు. ప్రతిపక్షం తప్పక ప్రశ్నించాలి.. పాలకపక్షం ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలకు మేలు కలిగేలా అధికార పక్షాన్ని నిలదీయాలని చెప్పారు. రోశయ్య తమిళనాడు గవర్నర్గా ఎలాంటి వివాదాలు లేకుండా పనిచేశారు. ఆయన పట్టుదల, మాటల్లో చతురత ఎంతో ముఖ్యమైనవి. పాలకపక్షంలో ఉంటే ప్రతిపక్షాలను.. ప్రతిపక్షంలో ఉంటే సీఎంగా ఉన్న వ్యక్తిని ఇరుకున పెట్టే విధానాన్ని ఆయన నుంచి మనం నేర్చుకోవాల్సిన అవసరముంది.అలాంటి నేత లేకపోవడం లోటే..కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది సీఎంలుగా పనిచేశారు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ద-న్రెడ్డి, భవనం వెంకట్రామ్, అంజయ్య, కోట్ల విజయభాస్కర్రెడ్డి, వైఎస్ రాజశేఖర్రెడ్డి.. ఇలాంటి వారంతా ప్రశాంతంగా ప్రభుత్వాన్ని నడిపించేందుకు కారణం రోశయ్య. సమస్యలను పరిష్కరించేందుకు వారికి కుడి భుజంలా ఆయన వ్యవహరించేవారు. అందుకే అప్పట్లో ఎవరు ముఖ్యమంత్రులుగా ఉన్నా నంబర్ 2 పొజిషన్ పర్మినెంట్. నంబర్ 1 పొజిషన్ మాత్రమే మా- రుతుండేది. ఎవరు సీఎం అయినా.. నంబర్ 2లో రోశయ్యే ఉండాలని కోరుకునేవారు. తెలంగాణ శాసనసభలో ఆయనలా వ్యూహాత్మకంగా సమస్యలను పరిష్కరించే నేత లేకపోవడం లోటుగా కనిపిస్తోంది.ఆర్యవైశ్యులకు సముచిత ప్రాధాన్యం ఏనాడూ సీఎం కావాలని రోశయ్య తాపత్రయ పడలేదు. సందర్భం వచ్చినప్పుడు ఆయన్ను సోనియాగాంధీ ముఖ్యమంత్రిని చేశారు. క్లిష్ట పరిస్థితుల్లో ఎంపిక చేశారంటే పార్టీకి రోశ-య్య పట్ల ఉన్న నమ్మకం, విశ్వాసం ఎలాంటిదో చెప్పొచ్చు. ఏనాడూ పదవులు కావాలని అధిష్ఠానాన్ని ఆయన కోరలేదు. హోదాలన్నీ వాటంతట అవే వచ్చాయి. రోశయ్యను అందరం స్ఫూర్తిగా తీసుకోవాలి. రాష్ట్రం ఆర్థికంగా రాణించాలంటే ఆర్యవైశ్యుల సహకారం అవసరం. వారి వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుమతులు ఇచ్చే బాధ్యత తీసుకుంటా. పార్టీలోనూ సముచిత ప్రాధాన్యం కల్పిస్తాం. హైదరాబాద్లో, రోశయ్య విగ్రహం రెండు తెలుగు రాష్ట్రాలు నాకు సమానమేనని రోశయ్య చెప్పారు. 50 ఏళ్ల క్రితమే హైదరాబాద్లోని అమీర్పేటలో ఇల్లు కట్టుకున్నట్లు తెలిపారు. నిఖార్సయిన హైదరాబాదీ రోశయ్య అని సంపూర్ణంగా విశ్వసిస్తున్నాను. ఆయనకు నగరంలో విగ్రహం లేకపోవడం లోటు. ఆర్యవైశ్య నేతలు మంచి ప్రాంతాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి సూచన చేస్తే.. ఆర్అండ్బ శాఖ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణం చేపడతాం. నాలుగో వర్ధంతి నాటికి దాన్ని పూర్తిచేస్తాం" అని రేవంత్ తెలిపారు.



# వ్యాపారాల్లో వాటాలు లాక్కోవడం ఇప్పుడే చూస్తున్నాం: సీఎం చంద్రబాబు

అధికారం అండతో గన్ను పెట్టి ఆస్తులు రాయించుకోవడం ఎక్కడా లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.



అమరావతి, డిసెంబర్ 04, (రిపబ్లిక్ న్యూస్): అధికారం అండతో గన్ను పెట్టి ఆస్తులు రాయించుకోవడం ఎక్కడా లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ భవన్ లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వ్యాపారాల్లో వాటాలు తీసుకున్న ఘటనలు దేశ చరిత్రలోనే లేవన్నారు. కొత్త తరహా నేరాల పట్ల చర్యలేంటో ప్రభుత్వం తీవ్రంగా ఆలోచిస్తోందని పేర్కొన్నారు. అవినీతి గురించి విన్నాం కానీ.. వ్యాపారాల్లో వాటాలు లాక్కోవడం ఇప్పుడే చూ- స్తున్నామన్నారు. తుపాకీ చూపించి మరీ ఆస్తుల్లో వాటాలు లాక్కోవడం మునుపెన్నడూ లేదన్నారు. ముంబయిలో మాఫియా బృందాలు లాక్కునే ఆస్తులను సీజ్ చేసే చట్టం ఉందని.. ఆ అంశంపై సమాచారం తెప్పించుకుంటామని చెప్పారు. ఆస్తులను పోగొట్టుకున్న వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

## ఏపీ సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్గా మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్



అమరావతి, ఏపీ సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్గా మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్ నియమితులయ్యారు. ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ ర్యాంక్ ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీఎం చంద్రబాబు కార్యక్రమాల నిర్వహణ వ్యవహారాలను పెందుర్తి వెంకటేశ్ పర్యవేక్షించనున్నారు. ఆయన గతంలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009, 2014 ఎన్నికల్లో విజయం సాధించారు.

# పెద్దపల్లిపై సీఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు

పెద్దపల్లి జిల్లాపై సీఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు.



హైదరాబాద్, డిసెంబర్ 04, (రిపబ్లిక్ న్యూస్): పెద్దపల్లి జిల్లాపై సీఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. పెద్దపల్లికి రూరల్ పోలీసు స్టేషన్, మహిళా పోలీసు స్టేషన్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ను మంజూరు చేశారు. ఎలిగేడు మండల కేంద్రానికి పోలీసు స్టేషన్, వ్యవసాయ మార్కెట్ను మంజూరు చేశారు. పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిని 100 పడకలకు పెంచేందుకు అనుమతి ఇచ్చారు. మంథనిలో 50 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేశారు. గుంజపడుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. పెద్దపల్లికి 4 వరుసల బైపాస్ రోడ్ మంజూరు చేశారు.తెలంగాణలో కొత్తగా రెండు ఆర్టీసీ డిపోలుతెలంగాణలో కొత్తగా రెండు ఆర్టీసీ డిపోలు మంజూరయ్యాయి. పెద్దపల్లి, ములుగు జిల్లా ఏటూరునాగారంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. కొత్త డిపోల మంజూరు సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. 10-15 సంవత్సరాల తర్వాత రెండు నూతన ఆర్టీసీ డిపోలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాటలో తీసుకుపోతున్నట్లు చెప్పారు. కొత్త డిపోల ద్వారా ఆ ప్రాంత వాసులకు, మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రయాణికులకు మేలు జరుగుతుందని చెప్పారు.

## ఉచిత విద్యుత్పై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: మంత్రి గొట్టిపాటి

ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి తెదేపా కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.



అమరావతి, డిసెంబర్ 04, (రిపబ్లిక్ న్యూస్): ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి తెదేపా కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. 200 యూనిట్ల వరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతిఒక్కరూ దీన్ని వినియోగించుకోవాలని కోరారు. 15,17,298 ఎస్సీ కుటుంబాలకు, 4,75,557 ఎస్టీ కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందిస్తోందని తెలిపారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది తెదేపానే అని గుర్తుచేశారు. దీనిపై అసత్య ప్రచారాలు నమ్మొద్దని కోరారు. కూటమి ప్రభుత్వంపై బురద చల్లేలా కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు.

## పీఎస్ఎల్వీ-సీ59 ప్రయోగం వాయిదా

శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి చేపట్టాల్సిన పీఎస్ఎల్వీ-సీ59 ప్రయోగం వాయిదా పడింది.



శ్రీహరికోట , డిసెంబర్ 04, (రిపబ్లిక్ న్యూస్): శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి చేపట్టాల్సిన పీఎస్ఎల్వీ-సీ59 ప్రయోగం వాయిదా పడింది. కౌంట్డౌన్ ప్రక్రియ 25.30 గంటల పాటు కొనసాగిన తర్వాతబుధవారం సాయంత్రం 4.08 గంటలకు పీఎస్ఎల్వీ-సీ59ను మొదటి ప్రయోగ వేదిక నుంచినింగిలోకి పంపాలని శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేశారు. ఉపగ్రహంలో సాంకేతిక లోపం కారణంగావాయిదా పడింది. గురువారం సాయంత్రం 4.12 గంటలకు పీఎస్ఎల్వీ-సీ59 నింగిలోకిపంపుతామని ఇస్రో ప్రకటించింది. యురోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాలనుపీఎస్ఎల్వీ-సీ59 .. కక్ష్యలోకి తీసుకెళ్లనుంది.

# నాపై నమోదైన ఎఫ్ఐ ఆర్ ను క్వాష్ చేయండి .. హైకోర్టులో హరీశ్ రావు పిటిషన్


పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్ను క్వాష్ చేయాలని కోరుతూ మాజీ మంత్రి, సిద్దిపేట భారాస ఎమ్మెల్యే హరీశ్రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



హైదరాబాద్, డిసెంబర్ 04, (రిపబ్లిక్ న్యూస్): పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో తనపై నమోదైన ఎఫ్ఐర్ను క్వాష్ చేయాలనికోరుతూ మాజీ మంత్రి, సిద్దిపేట భారాస ఎమ్మెల్యే హరీశ్రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన ఫోన్లను ట్యాప్ చేయించారని సిద్దిపేటకు చెందిన స్థిరాస్తి వ్యాపారి, కాంగ్రెస్ నేత గదగోని చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరీశ్రావు, విశ్రాంత పోలీసు అధికారి రాధాకిషన్రావుపై పంజాగుట్ట ఠాణాలో 120(బీ), 386, 409, 506 ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ, 66 ఐటీ యాక్ట్ ప్రకారం ఆదివారం కేసు నమోదైంది. ఎన్నికల సమయంలో హరీశ్రావు తన ఫోన్తోపాటు కుటుంబ సభ్యులకు చెందిన 20 ఫోన్లను ప్రణీత్రావు సహాయంతో ట్యాప్ చేశారని చక్రధర్ గౌడ్ ఆరోపించారు. తాను అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. న్యాయస్థానంలో రిట్ పిటిషన్ వేయగా... కోర్టు ఆదేశాలతోనే పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.

# జగన్.. వైకాపా నాయకులే భూ సమస్యలు పెంచారు: మంత్రి అనగాని

గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.



అమరావతి , డిసెంబర్ 04, (రిపబ్లిక్ న్యూస్): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయంలో జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. అన్ని రకాల భూ సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించారు. భూ వివాదాలకు ముగింపు పలికే విధంగా సదస్సులు నిర్వహించాలని తెలిపారు. ఈ సదస్సుల్లో భూ దురాక్రమణలు, 22ఏ భూముల ఉల్లంఘనపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసి, పేదలకు సమస్యలు లేని పాలన అందించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని మంత్రి వెల్లడించారు.ఇదీ చదవండి: తెలుగు రాష్ట్రాల్లో స్వల్ప భూ ప్రకంపనలు.. ఇళ్ల నుంచి బయటకు ప్రజల పరుగులుక్షేత్రస్థాయిలో వైకాపా అధినేత జగన్ ఆ పార్టీ నాయకులే భూ సమస్యలు పెంచారని మంత్రి అనగాని ఆరోపించారు. ల్యాండ్, ఇసుక, లిక్కర్ మాఫియాల ద్వారా గత ప్రభుత్వం నిధులు దోచుకుందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు ప్రతినెలా రివ్యూ పెట్టి సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజయవాడ వరదల కారణంగా సదస్సులు వాయిదా పడ్డాయన్నారు. ఈనెల 6 నుంచి వచ్చేనెల 8 వరకు 17,564 గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. నూతన రేషన్ కార్డులపైనా సదస్సుల్లో చర్చిస్తామన్నారు. గ్రామాల్లో లీజుకు ఇచ్చిన భూముల స్టేటస్ ఎలావుందో చూస్తామని తెలిపారు. మదనపల్లి వ్యవహారంపై సీఐడీ విచారణకు సీఎం ఇప్పటికే ఆదేశించారని మంత్రి వెల్లడించారు.

# కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు వేగవంతం
## న్యాయశాఖ కార్యదర్శితో మంత్రి ఫరూక్ సమీక్ష



అమరావతి , డిసెంబర్ 04 , (రిపబ్లిక్ న్యూస్): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ విభాగం( లీగల్, లెజిస్లేటివ్ అఫైర్స్, జస్టిస్ ) కార్యదర్శిగా జి ప్రతిభా దేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు ఫ్యామిలీ కోర్టు, నాలుగవ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి గా పనిచేస్తున్న ప్రతిభా దేవిని గత నెల 22వ తేదీన రాష్ట్ర న్యాయ విభాగం కార్యదర్శి గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం జరిగింది. రెండేళ్ల పాటు డిప్యూటేషన్ పై ప్రతిభా దేవి న్యాయశాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా న్యాయ విభాగం కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్ సిహెచ్ శ్రీధర్ లతో మంత్రి ఫరూక్ న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖలకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోడమే కాకుండా, శాసనసభ,శాసనమండలిలో ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందని పేర్కొన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు విషయంపై పకడ్బందీగా కార్యాచరణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం కర్నూలు ను న్యాయ రాజధాని అంటూ ప్రజలను మభ్యపెట్టడం జరిగిందని అన్నారు. రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో న్యాయపరమైన సేవలు సీమ జిల్లాల ప్రజలకు అత్యంత చేరువ కానున్నాయని అన్నారు.మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ సిహెచ్ శ్రీధర్ తో రాష్ట్రంలో వక్ఫ్ బోర్డు పునర్నిర్మానంపై మంత్రి ఫరూక్ చర్చించారు.

# కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపం మార్చొద్దు: కేటీఆర్

మూర్తీభవించిన స్త్రీగా తెలంగాణ తల్లిని కేసీఆర్ రూపొందించారని, ఆయన మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మారిస్తే చరిత్ర క్షమించదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.



హైదరాబాద్, డిసెంబర్ 04 , (రిపబ్లిక్ న్యూస్): మూర్తీభవించిన స్త్రీగా తెలంగాణ తల్లిని కేసీఆర్ రూపొందించారని, ఆయన మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మారిస్తే చరిత్ర క్షమించదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు."అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. నాడు ఇందిరాగాంధీ ప్రతిష్ఠించిన భరతమాత రూపాన్ని వాజ్పేయీ అధికారంలోకి రాగానే మార్చలేదు. దేశంలో ఎన్నోచోట్ల అధికార మార్పిడి జరిగింది. తెలుగుతల్లి విగ్రహ రూపం మారలేదు. కన్నడమాత విగ్రహం రూపు మారలేదు. కానీ, ఈ ముఖ్యమంత్రి.. కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేసన్నా. నాలుగేళ్ల తర్వాత రాజీవ్ంధీ విగ్రహం పెట్టిన స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తాం. అధికారం ఉందని సాయుధ బలగాల నడుమ మీ నాటకాలు కొంతకాలం సాగుతాయి. కానీ, ఎల్లకాలం ఇదే పరిస్థితి ఉండదు" అని కేటీఆర్ హెచ్చరించారు.

# చున్నీతోఉరివేసుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

చున్నీతో ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం పాల్పడిన సంఘటన ఆళ్లగడ్డలో చోటుచేసుకుంది.

ఆళ్లగడ్డ , డిసెంబర్ 04 , (రిపబ్లిక్ న్యూస్): చున్నీతో ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం పాల్పడిన సంఘటన ఆళ్లగడ్డలో చోటుచేసుకుంది. పుల్లారెడ్డి వీధికి చెందిన ఆదిలక్ష్మి, ఓబులేసుల దంపతుల కుమార్తె నందిని(13) ఒక ప్రైవేట్ స్కూల్లో 8వ తరగతి చదువుతుంది. విద్యార్థినిని తల్లి పరీక్ష రాసేందుకు వెళ్లమని మందలించడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో చున్నితో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు గమనించి పాపను ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు.

# మంత్రి లోకేశ్ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఆర్టీసీ డ్రైవర్ లోవరాజు

విధి నిర్వహణలో సినిమా పాటకు స్టెప్పులు వేసి సస్పెన్షన్కు గురైన తుని ఆర్టీసీ డిపో డ్రైవర్ లోవరాజు.. మంత్రి నారా లోకేశ్ ను కలిశారు.






అమరావతి, డిసెంబర్ 04 , (రిపబ్లిక్ న్యూస్): విధి నిర్వహణలో సినిమా పాటకు స్టెప్పులు వేసి సస్పెన్షన్కు గురైన తుని ఆర్టీసీడిపో డ్రైవర్ లోవరాజు.. మంత్రి నారా లోకేశ్ ను కలిశారు. తన సస్పెన్షన్ రద్దు చేయించి, తిరిగి విధుల్లోకి తీసుకునేలా చొరవ చూపించిన మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ జిల్లా తుని ఆర్టీసీ డిపోలో లోవరాజు అవుట్ సోర్సింగ్ విధానంలో డ్రైవర్గా పనిచేస్తున్నారు. అక్టోబర్ 24న బస్సు రౌతులపూడి నుంచి తుని డిపోకు వెళ్తుండగా మార్గమధ్యలో కర్రల లోడ్తో ట్రాక్టర్ అడొచ్చింది. చిన్న రోడ్డు కావడం, బస్సు ముందుకు వెళ్లలేని పరిస్థితుల్లో బస్సును నిలిపివేశారు. ఈ లోగా ప్రయాణికులకు వినోదం పంచడానికి లోవరాజు సరదాగా సినిమా పాటకు డ్యాన్స్ వేశారు. దీన్ని ఓ యువకుడు వీడియో తీయడంతో వైరల్ అయ్యింది.సోషల్ మీడియాలో డ్రైవర్ చేసిన డ్యాన్స్ చూసి మంత్రి లోకేశ్ మెచ్చుకున్నారు. ఈలోగానే నిబంధనలు ఉల్లంఘించారనే కారణంతో అధికారులు ఆయనను సస్పెండ్ చేశారు. ఇది మంత్రి లోకేశ్ దృష్టికి రావడంతో సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేయిస్తానని హామీ ఇచ్చారు. అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత వ్యక్తిగతంగా కలుస్తానని లోవరాజుకు మాట ఇచ్చారు. ఈ రోజు తన కుటుంబసభ్యులతో వెళ్లి మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా లోవరాజు యోగక్షేమాలను అడిగిన మంత్రి.. అన్ని విధాల అండగా ఉంటానన్నారు.

# బండరాయి పడి చిన్నారి మృతి

పాలిష్ ఫ్యాక్టరీలో నాపరాయి చిన్నారిపై పడి మృతి చెందిన సంఘటన నంద్యాల జిల్లా బేతంచెర్ల లో బుధవారం ఉదయం చోటుచేసుకుంది.

డోన్, డిసెంబర్ 04 , (రిపబ్లిక్ న్యూస్): పాలిష్ ఫ్యాక్టరీలో నాపరాయి చిన్నారిపై పడి మృతి చెందిన సంఘటననంద్యాల జిల్లా బేతంచెర్ల లో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొలుములపల్లె గ్రామానికి చెందిన మద్దయ్య, సువర్ణల కుమార్తె యామిని (5). ఇంటిదగ్గర ఎవరు లేకపోవడంతో వారి తల్లిదండ్రుల వెంట పనికి వెళ్లింది. తల్లిదండ్రులు పనిలో ఉండడంతో ఫ్యాక్టరీ ఆవరణంలో ఆడుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు చిన్నారిపై నాపరాయి పడింది. దాంతో పాపకు తీవ్ర గాయాలై మరణించింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మొబైల్ యాప్ సిద్ధం
## .. ఎల్లుండి నుంచి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం మొబైల్ యాప్ సిద్ధమైంది.

ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చేతుల మీదుగా గురువారం ప్రారంభించనున్నారు.




హైదరాబాద్, డిసెంబర్ 04 , (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక కోసం మొబైల్ యాప్ సిద్ధమైంది.ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చేతుల మీదుగా గురువారం ప్రారంభించనున్నారు. శుక్రవారం నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రాంతాలు అన్న తేడా లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందిస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. లబ్దిదారుల ఎంపిక నుంచి ఇళ్ల పంపిణీ పూర్తయ్యే వరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలని అధికారులు నిర్ణయించారు. గ్రామీణులను దృష్టిలో పెట్టుకుని యాప్లో తెలుగు వెర్షన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్టు సమాచారం.

# ఏపీలో 829 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

వైఎస్సార్ జిల్లాలో 829 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు అందజేశారు.

ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వీటిని జారీ చేశారు.



కడప, డిసెంబర్ 04 , (రిపబ్లిక్ న్యూస్): వైఎస్సార్ జిల్లాలో 829 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు అందజేశారు. ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వీటిని జారీ చేశారు. పాఠశాలల్లో పిల్లల అపార్ నమోదును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయలేదని కడప జిల్లా విద్యాధికారి నోటీసులు అందజేశారు. మూడు రోజుల్లో సమాధానం చెప్పాలని అందులో పేర్కొన్నారు. లేకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోవైపు సాంకేతిక సమస్యకు తాము ఎలా బాధ్యులవుతామని ఉపాధ్యాయులు అంటున్నారు.

# హైదరాబాద్ లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ .. ప్రభుత్వంతో కీలక ఒప్పందం

డిజిటల్ స్కిల్ డెవలప్మెంట్లో తెలంగాణ ముందు వరుసలో ఉందని, ఐటీ సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందని సీఎం రేవంత్రెడ్డి అన్నారు..



హైదరాబాద్ , డిసెంబర్ 04 , (రిపబ్లిక్ న్యూస్): డిజిటల్ స్కిల్ డెవలప్మెంట్లో తెలంగాణ ముందు వరుసలో ఉందని, ఐటీ సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందని సీఎం రేవంత్రెడ్డి అన్నారు. గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సైబర్ సమస్యలపై హైదరాబాద్ కేంద్రంగా పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో జూబ్లీహిల్స్లోని ఆయన నివాసంలో గూగుల్ ప్రతినిధులు భేటీ అయ్యారు. జీఎస్ఈసీ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో గూగుల్ కంపెనీ కీలక ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ఆ సంస్థ సీఐవో రాయల్ హన్సెన్, అరిజిత్ సర్కార్, శ్రీనివాస్ రెడ్డికి.. సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు లిపారు.ప్రముఖ ఐటీ కంపెనీలు ఇప్పటికే హైదరాబాద్లో ఉన్నాయని.. గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్, అమెజాన్, మెటా సంస్థలు ప్రధాన కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేశాయన్నారు. సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ ఏర్పాటు వల్ల వేల సంఖ్యలో ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. గ్లోబల్ హబ్ గా మారేందుకు హైదరాబాద్కు అన్ని అవకాశాలున్నాయని రాయల్ హన్సెన్ తెలిపారు. సైబర్, డిజిటల్ సెక్యూరిటీ, సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి హైదరాబాద్ అనుకూల ప్రాంతమని ఆయన తెలిపారు.

# వివాహ వార్షికోత్సవం రోజే దంపతులు, కుమార్తె దారుణ హత్య

దిల్లీలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని దుండగులు హత్య చేసిన ఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.



దిల్లీ, డిసెంబర్ 04 , (రిపబ్లిక్ న్యూస్): తెల్లవారితే తమ తల్లిదండ్రుల వివాహ వార్షికోత్సవం ఉందని వారి కుమారుడు, కుమార్తె అన్ని ఏర్పాట్లు చేశారు. కాని తెల్లారేసరికి వారి ఆనందం ఆవిరైపోయింది. తాను బయటకు వెళ్లొచ్చేలోపు గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో తల్లిదండ్రులు, సోదరి ప్రాణాలు కోల్పోవడంతో ఆ యువకుడు కన్నీరుమున్నీరుగా విలపించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీలోని నెబ్సరాయి ప్రాంతంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని దుండగులు కత్తితో దారుణంగా పొడిచి హత్య చేశారు. స్థానిక నెబ్సరాయి ప్రాంతంలో దంపతులు తమ కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇంట్లోకి చొరబడి దంపతులు రాజేష్(55), కోమల్(47), వారి కుమార్తె కవిత(23)లపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేసి హత్య చేశారు. ఆ సమయంలో వాకింగ్ వెళ్లిన కుమారుడు ఉదయం 7 గంటల సమయంలో ఇంటికి వచ్చేసరికి ముగ్గురు రక్తపు మడుగులో పడి ఉండడం చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రి రాజేష్ ఆర్మీలో పని చేసి రిటైర్ అయ్యాడని తెలిపాడు. డిసెంబర్ 4(నేడు) తమ తల్లిదండ్రుల వివాహ వార్షికోత్సవం ఉందని.. వారితో కలిసి సంతోషంగా జరుపుకుందామనుకునేలోపు ఈ దారుణం చోటుచేసుకుందని కుమారుడు కన్నీరమున్నీరయ్యాడు. కాగా, దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని.. దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

# ఇంటి మిద్దె కూలి
## ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి

అనంతపురం జిల్లా కుందుర్పిలో విషాదం చోటు చేసుకుంది. ఇంటి మిద్దె కూలి ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందారు.

కుందుర్పి, డిసెంబర్ 04 , (రిపబ్లిక్ న్యూస్): అనంతపురం జిల్లా కుందుర్పిలో విషాదం చోటు



చేసుకుంది. ఇంటి మిద్దె కూలి ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వీరు ఉంటున్న ఇల్లు దెబ్బతింది. దీనికితోడు మిద్దెపై వర్షపు నీరు నిలిచింది. ఈ క్రమంలోనే బుధవారం తెల్లవారుజామున మిద్దె కూలిపోయిందిమృతులను గంగన్న, శ్రీదేవి, సంధ్యగా గుర్తించారు.

# గుడివాడలో పెట్రోల్ ప్యాకెట్లతో దాడి కేసు.. 9 మంది వైకాపా నేతల అరెస్ట్

గుడివాడ, డిసెంబర్ 04 , (రిపబ్లిక్ న్యూస్): కృష్ణా జిల్లా గుడివాడ లో పెట్రోల్ ప్యాకెట్లతో దాడి చేసిన కేసులో 9 మంది వైకాపా నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. 2022 డిసెంబర్ 25న ఈ ఘటన జరిగింది. రావి టెక్స్టైల్స్పై కొందరు వైకాపా నేతలు, కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి




కొడాలి నాని ప్రధాన అనుచరుడు కాళీతో పాటు నీరుడు ప్రసాద్ పరారీలో ఉన్నారు. అరెస్ట్ అయిన వారిలో రాపాక పవన్ కుమార్, మెరుగుమాల ఉదయ్కుమార్, కొండ్రు శ్రీకాంత్, నీరుడు భార్గవ్, సుంకర సతీశ్, గొంటి అశోక్, రాజబోయిన తాండవకృష్ణ, గొల్ల వెంకటేశ్వరరావు, పండేటి మోషే ఉన్నారు. వీరిని పెదపారుపూడి స్టేషన్కు తరలించారు. నిందితులపై బీఎన్ఎస్ 143, 144, 188, 427, 506, రెడ్విత్ 149 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# అల్లు అర్జున్‌తో 'జగడం' చేయాలనుకున్న

## సుకుమార్.. అలా మిస్సయింది!

'జగడం' తొలుత మహేష్, ఆ తర్వాత అల్లుఅర్జున్‌తో తీయాలని అనుకున్నారట సుకుమార్. అయితే, దిల్‌రాజుతో జరిగిన చిన్న గొడవ కారణంగా రామ్ తీయాల్సి వచ్చింది.





అల్లు అర్జున్ కెరీర్కు మంచి బ్రేక్ నిచ్చిన చిత్రం 'ఆర్య'. దర్శకుడు సుకుమార్ తొలి చిత్రంతోనే ఘన విజయాన్ని అందుకున్నారు. వన్సైడ్ లవ్ అంటూ సరికొత్త కాన్సెప్ట్ తెరకెక్కిన 'ఆర్య' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ సినిమా తర్వాత సుకుమార్.. రామ్తో 'జగడం' తీశారు. అయితే, ఆ చిత్రం అంతగా ఆకట్టుకోలేదు. అసలు ఈ సినిమాను తొలుత మహేష్, ఆ తర్వాత అల్లుఅర్జున్తో తీయాలని అనుకున్నారట. అయితే, దిల్‌రాజుతో జరిగిన చిన్న గొడవ కారణంగా రామ్తో తీయాల్సి వచ్చింది."నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో ఎలా మాట్లాడాలో పెద్దగా తెలిసేది కాదు. ప్రపంచం కూడా మనలాగే ఉంటుందనుకోలేదు. 'ఆర్య' హిట్ కావడంతో గాల్లో తేలిపోయా. ఆ సందర్భంలో బన్నితో 'జగడం' చేయాలనుకున్నా. కథతో సహా అన్ని సిద్ధమయ్యాయి. అయితే, అదే సమయంలో దిల్ రాజుతో చిన్న సమస్య వచ్చింది. కోపం పట్టలేకపోయా. బాగా ఎమోషనల్ అయిపోయా. వెంటనే రాత్రికి రాత్రే రామ్ దగ్గరకు వెళ్లిపోయి, కథ చెప్పడం.. ఒకే చేయించుకోవడం అయిపోయింది. అంతేకాదు.. మరుసటి రోజే ముహూర్తం కూడా పెట్టించేశా. ముహూర్త సన్నివేశానికి బన్నిని, రాజుగారిని పిలిచా""అక్కడకు రాజుగారు వచ్చి 'నీకు బుద్ధుందా? ఏంటి ఇలా చేశావ్. కోపం వస్తే, కనీసం చెప్పకుండా సినిమాను ఓపెన్ చేసేస్తావా' అని తిట్టారు. నేను అమాయకుడినని ఆయనకు తెలుసు. నేనేమో నాది వీరత్వం అనుకున్నా. 'మీరు కథలో ఆ మార్పు చేయాలి.. ఈ మార్పు చేయాలి' అంటున్నారు అసలు కుదరదు అని చెప్పేశా. మొదటి సినిమా హిట్ కావడంతో నా జడ్జిమెంట్ను ఎవరైనా తప్పు అని చెబితే కోపం వచ్చేసేది. రామ్ చేసిన పాత్ర బన్ని లేదా మహేష్ అయితే బాగుండేది. అతడి తమ్ముడి పాత్రకు రామ్ అయితే సరిపోయేవాడు. కానీ, అలా జరగలేదు. 'జగడం' ఫ్లాప్ కావడంతో నాలోనూ మార్పు వచ్చింది. అప్పటి నుంచి ఎవరు ఏది చెప్పినా, వినేవాడిని." అంటూ 'జగడం' వెనుక కథను ఓ సందర్భంలో పంచుకున్నారు సుకుమార్. 'పుష్ప'తో బాక్సాఫీస్ వద్ద భారీ హిట్ అందుకున్న అల్లు అర్జున్-సుకుమార్ ఇప్పుడు 'పుష్ప2: ది రూల్తో మరోసారి ప్రేక్షకులను పలకరించడానికి వస్తున్నారు. డిసెంబరు 5న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1829:** బెంగాల్ ప్రెసిడెన్సీలో సతీ సహగమన దురాచారాన్ని నిషేధించారు.
- **1910:** ప్రసిద్ధ రాజనీతివేత్త, రచయిత, స్వాతంత్ర సమరయోధుడు, 8వ భారత రాష్ట్రపతి రామస్వామి వెంకట్రామన్ జననం (మ.2009).
- **1919:** భారతదేశ 13వ ప్రధానమంత్రి, దౌత్యవేత్త ఐ.కె.గుజ్రాల్ జననం (మ.2012).
- **1977:** భారత క్రికెట్ ఆటగాడు అజిత్ అగార్కర్ జననం.
- **1922:** ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జననం (మ.1974). (చిత్రంలో)
- **1936:** అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఏర్పడింది.
- **1981:** తెలుగు సినిమా నటి, రూపదర్శి, కాస్ట్యూం డిజైనర్ రేణూ దేశాయ్ జననం.


రామస్వామి వెంకట్రామన్


ఐ.కె.గుజ్రాల్


అజిత్ అగార్కర్


ఘంటసాల


రేణూ దేశాయ్

## అందుకే ఇండస్ట్రీ వదిలి

### వ్యాపారాన్ని ఎంచుకున్నా: వివేక్ ఒబెరాయ్

ఇండస్ట్రీ పై ఆధారపడకుండా వ్యాపారాన్ని ఎంచుకోవడానికి కారణాన్ని వివరించారు బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్. సినిమాలు హిట్ అయినప్పటికీ అవకాశాలు లేక 15 నెలలు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు.

ప్లాన్ ఏ విజయం సాధించకపోతే ప్లాన్ బీ ఎప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ . తాను సినిమాల నుంచి వ్యాపార రంగానికి మారడానికి గల కారణాన్ని వివరించారు. తన కెరీర్లో ఎన్నో హిట్ సినిమాలు ఉన్నప్పటికీ ఒక దశలో అవకాశాలు లేక 15 నెలలు ఇంట్లోనే కూర్చున్నట్లు వివరించారు."22 ఏళ్లలో నేను 67 ప్రాజెక్టులో నటించాను. వాటిలో ఎన్నో సినిమాలు మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్నాయి. కానీ, ఇండస్ట్రీలో పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉంటాయని చెప్పలేం. మనం బాగా నటించి అవార్డులు గెలుచుకున్నప్పటికీ కొన్నిసార్లు అవకాశాలు రావు. 2007లో నేను 'షూటౌట్ ఎట్ లోఖండ్వాలా'లో నటించాను. అందులో గణపత్ పాట బాగా వైరల్ అయింది. వరుస ఆఫర్లు వస్తాయని ఆశించాను. కానీ ఆ సినిమా విజయం తర్వాత ఒక్క అవకాశం కూడా రాలేదు. 15 నెలలు ఇంట్లోనే కూర్చున్నా. దీంతో ఇండస్ట్రీపై పూర్తిగా ఆధారపడకూడదని నిర్ణయించుకున్నా. నాకు నటనంటే ఇష్టం కాబట్టి ఈ పరిశ్రమకు వచ్చాను. ఎవరో మధ్యవర్తుల లాబీయింగ్ మన భవిష్యత్తును నిర్ణయించే పరిస్థితిని నేను కోరుకోలేదు అందుకే జీవనోపాధి కోసం వ్యాపార రంగంలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నా. ఆర్థికంగా స్థిరపడడానికి అది నాకెంతో ఉపయోగపడింది" అన్నారు.2002లో తెరకెక్కిన 'కంపెనీ'తో నటుడిగా ఎంట్రీ ఇచ్చారు వివేక్ ఒబెరాయ్. ఆ సినిమా ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. 'రోడ్, 'సాథియా', 'యువ', 'ఓంకార', 'క్రిష్ 3', 'లూసిఫర్' వంటి చిత్రాల్లో ఆయన నటించారు. వర్మ తెరకెక్కించిన 'రక్త చరిత్ర'తో ఆయన తెలుగువారికి సుపరిచితులయ్యారు. వివేక్ కీలకపాత్ర పోషించిన 'ఇండియన్ పోలీస్ ఫోర్స్' సిరీస్ ఈ ఏడాదిలో విడుదలై మంచి స్పందనను సొంతం చేసుకుంది.





## ఐసీసీ ఛైర్మన్‌గా జై షా.. బీసీసీఐ కార్యదర్శి రేసులో ఉన్నది వీరే!

జై షా ఐసీసీ ఛైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించడంతో తదుపరి బీసీసీఐ కార్యదర్శిగా ఎవరు ఎన్నికవుతారన్నది ఆసక్తి రేపుతోంది.




మొన్నటివరకు బీసీసీఐ కార్యదర్శిగా ఉన్న జై షా ఇటీవల ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో అతడి స్థానంలో బీసీసీఐ కార్యదర్శిగా ఎవరు ఎన్నికవుతారన్నది ఆసక్తిరేపుతోంది. గుజరాత్ క్రికెట్ సంఘం కార్యదర్శి అనిల్ పటేల్, ప్రస్తుతం బీసీసీఐ జాయింట్ సెక్రెటరీగా ఉన్న దేవత్ సైకియా రేసులో ఉన్నట్లు సమాచారం. దిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ కూడా బీసీసీఐ కార్యదర్శిపై ఆసక్తితో ఉన్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, అవన్నీ తప్పుడు కథనాలని ఆయన కొట్టిపారేశారు. 'ఏం జరుగుతుందో మాకు తెలియదు. అందరూ (బీసీసీఐ అధికారులు, రాష్ట్ర క్రికెట్ సంఘాలు) ఈ విషయంపై మౌనంగా ఉన్నారు. ప్రస్తుతానికి జాయింట్ సెక్రటరీ దేవీత్ సైకియా తాత్కాలిక కార్యదర్శిగా ఉంటారు. రోజువారీ ప్రాతిపదికన పరిష్కరించాల్సిన సమస్యలు చాలా ఉన్నాయి. కార్యదర్శిగా ఎన్నికయ్యే వారికి బీసీసీఐ ఎలా నడుస్తుందనే దానిపై కొంచెం అవగాహన ఉండాలి' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన ఆఫీస్ బేరర్ రాజీనామా చేసినట్లయితే 45 రోజుల్లోపు బోర్డు ప్రత్యేక సాధారణ సమావేశం నిర్వహించి అతని స్థానంలో కొత్తవారిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. అయితే, ఎన్నికలు నిర్వహించడం కోసం కనీసం నాలుగు వారాల ముందు ఎన్నికల అధికారిని కూడా నియమించాల్సి ఉంటుంది.

## రేగిపండ్లు తింటే ఆనందమే కాదు ..డయాబెటిస్, క్యాన్సర్స్ వంటివి దూరమై ఆరోగ్యం కూడా




పండ్లు అనగానే చాలా మంది ఆపిల్స్, ఆరెంజెస్.. ఇలా రెగ్యులర్‌గా తినే పండ్లనే చూస్తారు. రేగి పండ్లని ఆ లిస్ట్‌లోకి చేర్చకుండా టైమ్‌పాస్ పండ్లలో జమా కడతారు. కానీ, నిజానికి ఇందులోని పోషకాలు ఆపిల్స్ లాంటి పండ్లకి ఏ మాత్రం తీసిపోవు. వీటిని తినడం వల్ల చాలా సమస్యల్ని నయం చేసుకోవచ్చు.రేగిపండ్లని జుజుబి ఫ్రూట్ అని కూడా పిలుస్తారు. అంతమాత్రాన ఇవి జుజుబి అని తీసిపారేసే పండ్లు అసలు కాదండి. ఈ పండ్లలో ఫైబర్, విటమిన్స్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. వీటిలోని గుణాలు తెలిసిన చైనీస్ వారు అక్కడి వైద్యంలో వీటిని వాడుతుంటారు. వీటిని తినడం వల్ల నిద్ర సమస్యలు దూరమవ్వడం దగ్గర్నుంచి బాడీలోని టాక్సిన్స్ ఫ్లష్ అవుతాయి. అంతేకాకుండా ఏయే లాభాలు ఉన్నాయో తెలుసుకోండి.

### ఎముకలు, నరాలకి..

రేగి పండ్లలో కాల్షియం, మెగ్నీషియం ఉంటాయి. ఇవి ఎముకల్లో బలాన్ని పెంచి మజిల్స్‌ని ఇంప్రూవ్ చేస్తాయి. జంతువులపై జరిగిన కొన్ని పరిశోధనల్లో తేలిన విషయం ఏంటంటే.. ఈ పండ్లు తినడం వల్ల నాడీవ్యవస్థ ఆరోగ్యంగా మా-రుతుంది.

### బ్లడ్ షుగర్..

రేగిపండ్లు తినడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ ఇంప్రూవ్ అవుతాయి. షుగర్ ఉన్నవారు కూడా హ్యాపీగా తినొచ్చు. అయితే, మోతాదులో తినాలి. కారణం ఈ పండ్లు తియ్యగా ఉంటాయి కొన్ని సందర్భంలో. కాబట్టి, కొద్ది మోతాదులో తినడం ఎప్పుడైనా మంచిదే. అంతేకాదు.. ఈ పండ్లు తింటే నిద్ర సమస్యలు కూడా దూరమవుతాయి.

### ఇమ్యూనిటీ..

ఇమ్యూనిటీ మన బాడీలో ఎంత ఎక్కువగా ఉంటే అన్నీ సీజనల్ ప్రాబ్లమ్స్‌కి దూరంగా ఉండొచ్చు. కొంతమంది అంటారు. రేగిపండ్లు తింటే జలుబు చేస్తుందని.. కానీ, వీటిని తినడం వల్ల జలుబు, దగ్గు, జ్వరం వంటి సీజనల్ సమస్యలు దూరమవుతాయి.

### ఇన్‌ఫ్లమేషన్..

రేగి పండ్లలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల బాడీలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. దీంతో బాడీలో మంట, బాడీ పెయిన్స్ దూరమవుతాయి. చలికాలంలో తింటే మరింత ఎఫెక్టివ్‌గా పనిచేస్తాయి.

### కొలెస్ట్రాల్, గుండె సమస్యలకి..

రేగిపండ్లలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఇది గుండెకి చాలా మేలు చేస్తుంది. కాబట్టి, ఈ పండ్లని రెగ్యులర్‌గా తినొచ్చు. వీటితో పాటు ఈ పండ్లు తింటే కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది.

### ఫైబర్..

ఫైబర్ గురించి చాలా మందికే తెలిసే ఉంటుంది. రేగిపండ్లని తినడం వల్ల ఫైబర్ అందుతుంది. దీని వల్ల జీర్ణ సమస్యలు, మలబద్ధకం వంటి సమస్యలు దూరమవుతాయి. ఆ సమస్యలు ఉన్నవారు. రెగ్యులర్ రేగిపండ్లని తినడం మంచిది.

### డయాబెటిస్, క్యాన్సర్స్..

రేగి పండ్లలో ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్స్ అంటే విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్, పాలీశాచురైడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్నాయి. ఇవి మన శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి కాపాడతాయి. అంతే కాకుండా వీటిని తినడం వల్ల ప్రమాదకర గుండె సమస్యల లాంటి డయాబెటిస్, కొన్ని రకాల క్యాన్సర్స్ కూడా దూరమవుతాయి. చూడండి.. చిన్న పండ్లే అని అనుకునే ఈ పండ్లతో ఎన్ని సమస్యలు దూరమవుతాయో.









### గర్భిణీలు తినేముందు..



ఇన్ని గుణాలు ఉన్నాయి కాబట్టే ఈ పండుని కుకీస్‌లో బదులు కాఫీతో తీసుకుంటారు. అయితే, గర్భిణీలు ఈ రేగి పండ్లు తినే విషయంలో డాక్టర్‌ని సంప్రదించాలి. ఈ విషయాన్ని కచ్చితంగా గుర్తుంచుకోవాలి. అదే విధంగా, కొంతమందికి అలర్జీ ప్రాబ్లమ్స్ ఉంటాయి. వారు కూడా ఈ పండుని తినకపోవడమే మంచిది.

గమనిక:ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.